మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 15-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 176

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

# నిన్న సర్కార్ భూమి... ఈరోజు కేటాయింపు చర్చ..

## అనుంపల్లిలో రూ. 8 కోట్ల విలువైన భూమిపై వేడెక్కిన వివాదం

- గ్రామం ఒక్కటై తిరుగుబాటు
- చిట్వేలి తహసిల్దార్ తిరకాసుపై విమర్శలు
- మండలంలో రోజురోజుకు పెరుగుతున్న భూ సమస్యలు

**చిట్వేల్, ఏప్రిల్ 14: (డ్రీం టైమ్స్)**

ఒకే భూమిపై ప్రభుత్వ వైఖరి మారిందనే ఆరోపణలతో తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలం అనుంపల్లి గ్రామం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. గతంలో ప్రభుత్వ భూమిగా ప్రకటించి ఆక్రమణలకు నిషేధం బోర్డును ఏర్పాటు చేసి నిషేధాజ్ఞులు విధించిన స్థలం, ఇప్పుడు కేటాయింపుల చర్చకు రావడం గ్రామస్థుల్లో తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోంది

చిట్వేల్--రాపూర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న సుమారు 8 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ భూమి మార్కెట్ విలువ కోట్లలో ఉందని స్థానికులు చెబుతున్నారు. కీలక సర్వే నంబర్లలో ఉన్న ఈ భూమిపై ప్రభావశీల వర్గాలు ఆసక్తి చూపుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**గతంలో నిలిపివేత... ఇప్పుడు మళ్లీ కదలిక**

ఏళ్ల కిందట ఇదే భూమిపై ఫెన్సింగ్ ప్రయత్నం జరిగినప్పుడు

-మిగతా 3 లో








## బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

- కొత్త సీఎంగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక
- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్

**పాట్నా**

బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు.

-మిగతా 3 లో

# అమరావతి శక్తి ఇదీ


## క్వాంటమ్ కల సాకారంతో మరో చరిత్ర

- రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రపంచానికి అందించాం
- స్వదేశీ హార్డ్‌వేర్‌ను అందించే సత్తా రాష్ట్రానికి ఉంది
- టెక్నాలజీకి లాంచ్ ప్యాడ్‌గా అమరావతి
- తొలి టెస్ట్ బెడ్స్ కలిగిన రాష్ట్రంగా ఏపీ
- హార్డ్‌వేర్‌ను ధ్రువీకరించే సామర్థ్యం వచ్చింది
- క్వాంటమ్‌లో 45 లక్షల మందికి శిక్షణ ఇస్తాం
- టెక్నాలజీతో రాష్ట్ర భవిష్యత్ నిర్మిస్తున్నాం
- ఆధునిక పరిశోధన కేంద్రంగా అమరావతి: సీఎం
- ఎస్ఆర్ఎం, మేధా టవర్స్‌లో టెస్ట్ బెడ్స్ ప్రారంభం
- 2 క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీలు జాతికి అంకితం

**అమరావతి,**


అమరావతిలో ఏదో మ్యాజిక్, శక్తీ ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రపంచానికి అందించగలిగామని చెప్పారు. ప్రపంచానికి క్వాంటమ్ హార్డ్‌వేర్‌ను అందించే సత్తా ఆంధ్రప్రదేశ్‌కు ఉందని నిరూపితమైందన్నారు. క్వాంటమ్ కంప్యూటర్‌లను తయారు చేయాలన్న కలను సాకారం చేసి చరిత్ర సృష్టించామన్నారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన క్వాంటమ్ రిఫరెన్సు ఫెసిలిటీని మంగళవారం పరిశీలించారు. క్వాంటమ్ టెస్టింగ్ మెషీన్‌ను స్పృశించి ఆనందం వ్యక్తం చేశారు.

-మిగతా 3 లో



## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- ఉదయం 10.31గంటలకు విడుదల
- ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడి




**అమరావతి**

ఏపీలో ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను బుధవారం ఉదయం 10.31గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఫలితాలను వెబ్‌సైట్లలోనూ పొందొచ్చు. అలాగే, మనమిత్ర ద్వారా వాట్సప్‌లోనూ (9552300009) ఈ ఫలితాలు పొందొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

-మిగతా 3 లో

## మోడీకి ట్రంప్ ఫోన్ కాల్..



3 లో




## తమిళనాడు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

- మహిళలకు ఉచిత సిలిండర్, నెలకు రూ.2,000
- చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50,00,000 వరకు రుణాలు
- రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం
- జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం
- జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

**న్యూఢిల్లీ**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. చెన్నైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఈ మేనిఫెస్టో విడుదల చేశారు. మంగళవారం తమిళ నూతన సంవత్సరం కావడం విశేషం. ఈ సందర్భంగా పార్ట మేనిఫెస్టో విడుదల చేయడం మంచి పరిణామం అని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, బీజేపీ నేతలు కే అన్నామలై, తమిళిసై సౌందరరాజన్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు.ఇక, ప్రజలకు అనేక ఉచిత పథకాల్ని బీజేపీ ప్రకటించింది.

-మిగతా 3 లో


## జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌కు చెక్

- ఇకనుంచి భారీగా జరిమానా విధింపు
- నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన

3 లో



## రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ రావాల్సిందే..





- మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశం..
- మే 1 నుంచి అమలు

**న్యూఢిల్లీ**

మాతృభాష అమలు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మహారాష్ట్రలో రిక్షాలు, ట్యాక్సీలు నడిపే డ్రైవర్లకు మరాఠీ భాష రావాల్సిందే అంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయం మాతృభాషను అమలు చేయాలనే ఆలోచనకన్నా.. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్నట్లుగా కనిపిస్తోంది.

-మిగతా 3 లో



## సోషల్' గీత దాటితే వేటే

- నకిలీ ఖాతాలతో వదంతులు వ్యాప్తి చేస్తే తప్పించుకోలేరు
- ఏఐ విశ్లేషణ, ఫోరెన్సిక్‌లతో గుర్తిస్తామని డీజీపీ హెచ్చరిక
- 1,549 కేసుల్లో 1,344 మంది అరెస్టు
- వదంతులు వ్యాప్తి చేస్తే తప్పించుకోలేరు: డీజీపీ

3 లో

## మహానాడు వేదికపై 17న తుది నిర్ణయం

- టీడీపీ నేతలతో చర్చించిన లోకేశ్
- జాతీయ, రాష్ట్ర కమిటీలు, పొలిట్‌బ్యూరో సభ్యులు దాదాపు ఖరారు
- ఏ ఆత్మ చెప్పిందో జగన్ 'మావిగన్' అని కలవరిస్తున్నారు: లోకేశ్

3 లో



## ఆస్ట్రేలియా ఆర్మీ చీఫ్‌గా మహిళ..

**ప్రకటించిన ప్రధాని అల్బనీస్**



**క్యాన్‌బెరా: ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
ఆస్ట్రేలియా కొత్త చరిత్ర లిఖించనున్నది. తొలిసారి ఓ మహిళా ఆ దేశ ఆర్మీకి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. సుసాన్ కోయిలీ(ాబయిఖఅ జశీఎశ్రీవ)ని ఆర్మీ చీఫ్‌గా నియమించారు. ఆస్ట్రేలియా సర్కారు ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. 125 ఏళ్ల ఆసీస్ చరిత్రలో.. ఆర్మీకి తొలిసారి ఓ మహిళ అత్యున్నత పదవిలో కొనసాగనున్నది. జూలైలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం సుసాన్ కొయిలీ లెఫ్టినెంట్ జనరల్ గా ఉన్నారు. లెఫ్టినెంట్ జనరల్ సైమన్ స్టువార్ట్ స్థానంలో ఆమె తన కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. 1987లో ఆర్మీ రిజర్వ్‌లో ఆమె ఉద్యోగంలో చేరారు. కమాండ్ పాత్రలో ఆమె ఎన్నో మిషన్స్ చేపట్టారు. ఆఫ్ఘనిస్తాన్, పశ్చిమాసియాలో ఆమె విధులు నిర్వర్తించారు. కొత్త మిలిటరీ చీఫ్‌పై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటన చేశారు. ఇది చరిత్రాత్మక సందర్భం అవుతుందని రక్షణ మంత్రి రిచర్డ్ మార్ల్స్ పేర్కొన్నారు.

## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

**10 మంది మృతి.. 40 మందికి గాయాలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా, 40 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది. ఘటన జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.


## ప్రపంచంలోనే అతి పెద్ద ఆనకట్టకు చైనా శ్రీకారం

**బ్రహ్మపుత్ర నదిపై భారీ జల విద్యుత్తు ప్రాజెక్ట్**



**బీజింగ్ ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
చైనా నిర్మించిన త్రీ గోర్జెస్ ఆనకట్ట వల్ల భూ భ్రమణం నెమ్మదించిందన్న విషయం విన్నప్పుడు ప్రపంచం దిగ్భ్రాంతి చెందింది. ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద జల విద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆ దేశం చేపట్టింది. టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగో(బ్రహ్మపుత్ర) నదిపై దీన్ని సుమారు 1.2 ట్రిలియన్ల యువాన్ల ఖర్చుతో నిర్మిస్తున్నది. త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే అధిక సామర్థ్యంతో గంటకు సుమారు 300 బిలియన్ల కిలోవాట్ల విద్యుత్తును ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి చేయాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నది.

## వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా.. ప్రధాని మోదీ ప్రకటన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించనున్నట్టు ప్రధాని మోదీ వెల్లడించారు. మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరి కొన్ని నెలల్లో ప్రారంభమవుతుందని చెప్పారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా రాష్ట్రాన్ని శుభ్రంగా ఉంచాలని ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు.పరిశుభ్రత ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని.. పుణ్యక్షేత్రాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని ఆయన కోరారు. ఢిల్లీ–డెహ్రాడూన్ ఎకనమిక్ కారిడార్‌ను మంగళవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

# నోయిడా హింస వెనుక భారీ కుట్ర


- **పోలీసులపై దాడికి ప్లాన్..**
- **పాక్ హస్తంపై అనుమానాలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
వేతనాల పెంపు కోరుతూ ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో కార్మికులు చేపట్టిన నిరసనలు సోమవారం హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఘటనల వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాదు.. దీని వెనుక పాకిస్తాన్ హస్తం కూడా ఉండొచ్చనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కార్మికుల ఆందోళనలు హింసాత్మకంగా మారడం వెనుకు పాకిస్తాన్ కుట్ర ఉండొచ్చని యూపీ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌బహర్ అన్నారు. ఈ ఘటనల్ని ప్రణాళికాబద్ధంగా జరిగిన కుట్రగా ఆయన అభివర్ణించారు. ఈ విషయాన్ని పోలీసులు తేలుస్తారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకే ఈ ఘటనలు జరిగాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల నోయిడాలోని మీరట్ ప్రాంతంలో నలుగురు ఉగ్రవాదులు అరెస్టైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విచారణలో సంచలన విషయాలు బయటపడుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ హింస వెనుక భారీ కుట్ర, ప్లానింగ్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ముందుగా కొందరు కార్మికులు వారం రోజుల క్రితం.. ఫ్యాక్టరీల్లో వేతనాల పెంపు కోరుతూ నిరసన చేపట్టారు. తర్వాత ఈ నిరసనలు వీధుల్లోకి మారాయి. వేల మంది కార్మికులు నిరసనల్లో చేరారు. తర్వాత మరింత ఆందోళనకరంగా మారాయి. పోలీసులపైకి రాళ్లు రువ్వడం, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేయడం, ఫ్యాక్టరీల్ని ధ్వంసం చేయడం, వాహనాల దహనం వంటి ఘటనలు జరిగాయి. అయితే, ఈ ఘటనలు ఉన్నట్లుండి జరిగినవి కావని, వీటి వెనుక భారీ కుట్ర ఉందని పోలీసులు తేల్చారు. ఆందోళనకారులు ఈ ఘటనలకు మూడు రోజుల ముందు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని చాటింగ్, ఆడియో కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. అందరినీ సమీకరించడం, నిరసనలు తెలపడం వంటి వాటిపై చర్చించుకున్నారు. ఈ డిజిటల్ ఎవిడెన్స్‌ను ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. అలాగే, ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా చాటింగ్ చేసుకున్నట్లు గుర్తించారు. అందులో ఏకంగా మరుసటి రోజు పోలీసులపై ఎలా దాడి చేయాలో కూడా చర్చించారు. పోలీసులపై దాడి చేసేందుకు కారం కూడా తీసుకురావాలని చర్చించుకున్నారు. పోలీసుల దాడుల్లో తమవాళ్లు గాయపడ్డారని, అందుకు బదులుగా మరిన్ని నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ దాడుల్లో కొందరు మాస్కులు ధరించి పాల్గొనడం కూడా చర్చనీయాంశంగా మారింది. వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కార్మికులతో సంబంధం లేని వారు ఈ ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులు దాదాపు 400 మందిని అరెస్టు చేశారు. 7 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు.

## ఎన్నికల తర్వాతపెట్రో వాత?

- **లీటర్ పెట్రోల్‌పై రూ.18, డీజిల్‌పై 35**
- **నష్టాలను భరిస్తున్న చమురు కంపెనీలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెట్రో ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీలు లీటర్ పెట్రోల్‌పై రూ.18, డీజిల్‌పై రూ.35 నష్టాలను భరిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు చమురు ధరలు పెంచితే అవి అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడనున్నందున వాటి ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్రం పెట్రో ధరలను భారీగా పెంచే అవకాశం ఉంది.చమురు ధరలు భారీగా పెరగడంతో దేశంలోని మూడు ప్రధాన ఆయిల్ కంపెనీలు రోజుకు రూ.2,400 కోట్ల నష్టాన్ని ఎదుర్కోనుండగా, ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించడంతో ఈ నష్టం రూ.1,600 కోట్లకు చేరుకుంది. అంతర్జాతీయంగా ప్రతి 10 డాలర్ల పెరుగుదలకు మనపై లీటర్‌కు రూ.6 భారం పడుతుంది. కాగా, 2022 ఆగస్టు తర్వాత తొలిసారిగా అమెరికా సగటున ప్రతి గ్యాలన్ పెట్రోల్‌కు 4 డాలర్లు పెంచింది.

## అంబేడ్కర్‌కు మోడీ నివాళులు

- **దేశ నిర్మాణాంలో అంబేడ్కర్ కృషి అపూర్వమని వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్ర ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేడ్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయణ్ని గుర్తు చేసుకుంటున్నారు

# రేపు రెండో విడత చర్చలు..

-పాక్‌లో అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి చర్చలు జరిగే అవకాశం
-4 పాయింట్లతో చైనా శాంతి ప్రణాళిక



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
ఇరాన్–అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పంద చర్చలు ముగియలేదని, పాకిస్థాన్ వేదికగా రెండో విడత చర్చలు రెండ్రోజుల్లో జరుగుతాయని అమెరికా తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని మంగళవారం సూచనప్రాయంగా వెల్లడించారు. న్యూయార్క్ పోస్ట్‌తో ఆయన మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో అమెరికా–ఇరాన్ అధికారులు ఇస్లామాబాద్ వేదికగా రెండో విడత చర్చలు జరపనున్నారని తెలిపారు. 'మీరంతా అక్కడే ఉండండి. రానున్న రెండు రోజుల్లో కచ్చితంగా అక్కడ ఏదో జరగనుంది. మేము అక్కడికి వెళ్లడానికే ఎక్కువగా మొగ్గుచూపుతాం' అని ఇస్లామాబాద్‌ను ఉద్దేశించి అన్నారు. కాగా, రెండు వారాల పాటు రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రకటించిన అనంతరం పాక్ వేదికగా ఈ నెల 11న జరిగిన శాంతి చర్చలు విఫలం అయిన సంగతి తెలిసిందే. రెండో విడత చర్చలకు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌తో సంబంధం ఉందని ట్రంప్ పరోక్షంగా సూచించారు. 'ఫీల్డ్ మార్షల్ చాలా గొప్పగా పనిచేస్తున్నారు. అందువల్ల మనం మళ్లీ అక్కడికి వెళ్లే అవకాశమే ఎక్కువగా ఉంది' అని ట్రంప్ తెలిపారు. కాగా, రెండో విడత చర్చల కోసం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఉప ప్రధాని ఇషాక్ దార్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఉన్నత వర్గాలను ఉటంకిస్తూ ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వెల్లడించింది. రెండు వారాల కాల్పుల విరమణ డెడ్‌లైన్ ఏప్రిల్ 21తో ముగుస్తున్న క్రమంలో దానికన్నా ముందే ఈ చర్చలు ప్రారంభమవుతాయని తెలిపింది. రెండో విడత చర్చలు ఇస్లామాబాద్‌లో గురువారం జరుగుతాయని, అందులో కచ్చితంగా ఒప్పందం జరిగే అవకాశం ఉందని మరో ఉన్నతాధికార వర్గం పేర్కొంది. అదే రోజు పాక్ ప్రధాని సౌదీ అరేబియాను సందర్శిస్తారని, తర్వాత తుర్కియేలో స్వల్పకాల పర్యటన చేస్తారని పాక్ అధికారులు వెల్లడించారు.

**4 పాయింట్లతో చైనా శాంతి ప్రణాళిక**
పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు పాక్ మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చలు విఫలమైన వేళ.. సంక్షోభానికి తెరదించేందుకు చైనా ముందడుగు వేసింది. అశాంతితో నిండి ఉన్న పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని ప్రోత్సహించడానికి నాలుగు సూత్రాల మార్గసూచీని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిపాదించారు. మంగళవారం అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో బీజింగ్‌లో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదన చేశారు. ప్రాంతీయ శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహించడం, జాతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించడం, సమన్వయ అభివృద్ధి, భద్రత, అంతర్జాతీయ నియమాధారిత వ్యవస్థను పరిరక్షించడం అనే నాలుగు అంశాలను ఆయన తన ప్రణాళికలో ప్రతిపాదించారు.

# మధ్యలో జోక్యం చేసుకోవద్దు..

-అమెరికాకు చైనా తీవ్ర హెచ్చరిక
-ట్రంప్ దిగ్బంధనం వేళ హెర్ముజ్ దాటిన చైనా చమురు ట్యాంకర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
హెర్ముజ్ జలసంధిపై దిగ్బంధనం విధించడంపై అమెరికాకు చైనా గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌తో చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోవద్దని కూడా అమెరికాను చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్ హెచ్చరించారు. ఇరాన్‌తో తమకు వాణిజ్య, ఇంధన ఒప్పందాలు ఉన్నాయని, తమ వ్యవహారాల్లో ఇతరులు జోక్యం చేసుకోరాదని తాము ఆశిస్తున్నామని జున్ మంగళవారం చెప్పారు. హెర్ముజ్ జలసంధి చైనాకు తెరిచే ఉందని, ఉంటుందని ఆయన అన్నారు. అమెరికా ఆంక్షలకు గురైన చైనాకు సంబంధించిన ఒక ట్యాంకర్ మంగళవారం హెర్ముజ్ జలసంధిని దాటింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యం దిగ్బంధనం ప్రారంభించిన తర్వాత ఈ ఇంధన కీలక మార్గం గుండా ప్రయాణించిన తొలి నౌకలలో ఇది ఒకటిగా నిలిచింది.ట్రంప్ బెదిరింపులను సైతం లెక్కచేయకుండా చైనా నౌక హెర్ముజ్‌ను దాటడం, అమెరికాపై విమర్శలు గుప్పించడానికి ఇరాన్‌కు ఆయుధంగా మారింది. ట్రంప్ భయపడని దేశాలకు మాత్రమే ఈ దిగ్బంధనం వర్తిస్తుందని ఇరాన్ వ్యాఖ్యానించింది. సముద్ర ట్రాఫిక్ డాటా ప్రకారం మధ్యశ్రేణి ట్యాంకర్ అయిన రిచ్ స్టారీ హెర్ముజ్‌ను విజయవంతంగా దాటిన తర్వాత ప్రస్తుతం ఒమన్ గల్ఫ్‌లో ఉంది. పాకిస్థాన్‌లో అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమైన తర్వాత ఇరాన్ పోర్టుల్లోకి ప్రవేశించే లేదా బయలుదేరే నౌకలను అమెరికా అడ్డుకోవడం ప్రారంభిస్తుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

# బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

మొదటి తరువాయి

ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

## తమిళనాడు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

మొదటి తరువాయి

సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం వంటి అంశాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ మేనిఫెస్టో రూపొందించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. మేనిఫెస్టోలోని కీలక హామీలివి. మహిళలకు ప్రతి నెలా రూ.2,000 ఆర్థికసాయం, ప్రతి కుటుంబానికి ఏటా రూ.10,000 ఆర్థిక సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్, జీరో ఎఫ్ఐఆర్ రిపోర్టింగ్ సిస్టమ్ అమలు, క్రూరమైన నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, బస్సులు, స్కూళ్లు, యూనివర్సిటీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, అర్హులైన మహిళలు ఈ స్కూటర్లు కొనుక్కునేందుకు రూ.25,000 ఆర్థిక సాయం, స్వయం సహాయక గ్రూపులకు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50,00,000 వరకు రుణాలు, రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, మహిళల పేరు మీద ఇల్లు కొంటే మూడు శాతం తక్కువ స్టాంప్ డ్యూటీ విధింపు వంటివి ఉన్నాయి. తమిళనాడులో ఈ నెల 23 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ 234 అసెంబ్లీ సీట్లున్నాయి. 5.67 కోట్ల మంది ఓటర్లున్నారు. 44 ఎస్సీ సీట్లు, 2 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు. మే 4న ఫలితాలు వెలువడుతాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే, టీవీకే, బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా పోటీ చేస్తున్నాయి.

## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

మార్చి 23 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైనప్పటికీ అనుకున్న సమయానికన్నా ముందే ఫలితాలను విడుదలకు సిద్ధం చేయడం విశేషం. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన అప్‌డేట్స్‌ను వెబ్‌సైట్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

## జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌కు చెక్

**-ఇకనుంచి భారీగా జరిమానా విధింపు**
**-నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన**



**న్యూఢిల్లీ**

జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు విధించే జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. కొత్త నిబంధనలు ఏప్రిల్ 15 నుంచి అంటే నేటినుంచే అమల్లోకి వస్తాయి. దీని ప్రకారం.. వాహనానికి అనుమతించిన బరువు కంటే అదనంగా ఉన్న భారాన్ని బట్టి జరిమానా వసూలు చేస్తారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026ని మోర్త్ నోట్గి÷ చేసింది. 10 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు ఎటువంటి జరిమానా విధించరు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు సాధారణ టోల్ రుసుము కంటే 2 రెట్లు అధికంగా రుసుము వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్‌తో వెళితే సాధారణ టోల్ రుసుము కంటే 4 రెట్లు అధికంగా విధిస్తారు. ఓవర్‌లోడ్‌కు విధించే జరిమానాను ఫాస్టాగ్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ఎ÷–లాజా వద్ద బరువు కొలిచే ఏర్పాటు లేకపోతే ఎలాంటి రుసుములూ ఉండవు. రహదారుల భద్రతను పెంపొందించడం, రహదారి మౌలిక సదుపాయాలను రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ రావాల్సిందే..

మొదటి తరువాయి

మహారాష్ట్రలో మే 1 నుంచి రిక్షాలు, ట్యాక్సీలు నడిపే డ్రైవర్లకు మరాఠీ భాషపై కనీస అవగాహన ఉండాలని రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్త కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. రవాణా శాఖ దీనిపై స్పెషల్ డ్రైవ్ చేపడుతుందని, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కనీస మరాఠీ భాష మాట్లాడటం, అర్థం చేసుకోవడం రాని డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. "మే 1న మహారాష్ట్ర దినోత్సవం. ఆ రోజు నుంచి రాష్ట్రంలో లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు మరాఠీ తెలిసి ఉండాలి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపడతాం. 59 ప్రాంతీయ, ఉప ప్రాంతీయ కార్యాలయ పరిధిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లు టెస్టులు పాసవ్వాలి. మరాఠీ రాయడం, చదవడం వచ్చి ఉండాలి" అని మంత్రి ప్రతాప్ సర్నాయక్ అన్నారు. డ్రైవర్లతో కమ్యూనికేషన్ సందర్భంగా ప్రయాణికుల నుంచి వచ్చిన వేలాది ఫిర్యాదుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ముంబై మెట్రోపాలిటన్ పరిధిలో ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రాంతీయ భాష నేర్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వారు ఆ ప్రాంతపు భాష నేర్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషపై గర్వపడాలని అభిప్రాయపడ్డారు.

## 543 నుండి 850కి పెరగనున్న ఎంపీ స్థానాలు!

మొదటి తరువాయి

పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ప్రస్తుతం నారి శక్తి వందన్ అభినియం పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టబోతుంది కేంద్రం. 2011 జనాభా లెక్కలకు అనుగుణంగా ప్రస్తుతానికి మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తారు. దీని ప్రకారం మహిళలకు పార్లమెంట్‌లో 273 సీట్లు వచ్చే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును త్వరలోనే పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ రెండింటిని 2029 లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ఒక కమిటీని నిర్ణయిస్తుంది. ఈ కమిటీయే మహిళలకు సీట్లు కేటాయిస్తుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు సీట్లు పెరుగుతాయి. ఈ బిల్లులు అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 55, ఆర్టికల్ 81లను సవరించాలి. ఇది 131వ రాజ్యాంగ సవరణ అవుతుంది.

# నిన్న 'సర్కార్ భూమి'... ఈరోజు 'కేటాయింపు చర్చ'

మొదటి తరువాయి



గ్రామ యువత స్వయంగా అడ్డుకుని ప్రభుత్వ హక్కులను కాపాడింది. అనంతరం రెవెన్యూ అధికారులు స్థలాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించి నిషేధ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ నిర్ణయాలపై స్పష్టత లేకుండా కొత్త ప్రక్రియలు ప్రారంభమవుతుండటంతో అనుమానాలు మరింత పెరిగాయి.

**అభివృద్ధికి 'లేదు'... కేటాయింపులకు 'అవును'?**

గ్రామంలో ప్రాథమిక అవసరాల కోసం భూమి కోరిన సందర్భాల్లో అధికారుల నుంచి నిరాకరణ ఎదురైందని స్థానికులు చెబుతున్నారు. అదే స్థలం ఇప్పుడు ఇతర అవసరాల కోసం పరిశీలనలో ఉండటం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.

**ముహూర్తం ప్రచారం -- ఉద్రిక్తతకు దారితీస్తోన్న వాతావరణం**

త్వరలోనే ఈ భూమిపై అధికారిక ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారం గ్రామంలో వేడిని పెంచింది. ఏప్రిల్ 15న కీలక నిర్ణయం ఉంటుందని ప్రచారం జరుగుతుండగా, యువత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిస్తోంది.

**గ్రామం ఒకే స్వరం**

ఈ అంశంలో గ్రామస్థులు ఏకగ్రీవంగా నిలబడి, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. భవిష్యత్ తరాల అవసరాలకు ప్రభుత్వ భూమి రక్షణ అత్యవసరమని వారు స్పష్టం చేస్తున్నారు. ఒకే భూమిపై గతంలో తీసుకున్న నిర్ణయాలు, ప్రస్తుతం జరుగుతున్న చర్యల మధ్య వ్యత్యాసం ఎందుకనే అంశంపై అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పారదర్శక విచారణ జరిగి వాస్తవాలు బయటపడితేనే పరిస్థితి చల్లారే అవకాశం ఉందని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు.

**అనుంపల్లిలో రగులుతున్న ఈ భూమి వివాదం...**

నెల్లూరు రహదారి కి పక్కనే అనుంపల్లికి అనుబంధంగా ఉన్న ఈ భూమి వ్యవహారం ముదిరి పాకాన పడింది. పాత అనుమ్పల్లిని ఖాళీ చేసి కొత్తగా రోడ్డు పక్కన నిర్మించుకున్న గ్రామస్తులకు ఇతర అవసరాలకు ఇక ప్రభుత్వ స్థలమే లేకపోవడంతో ఆ ఊరు ఊరంతా ఒక్కటై చేస్తున్న పోరాటానికి గ్రామంలో ఐక్యత తోడవుతుంది. రాజకీయ ఒత్తులతో అధికారులు ఆడుతున్న నాటకాలకు ఏదైనా గ్రామస్తులకు వ్యతిరేకంగా తీర్పు జరిగితే దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి దాకా తీసుకుపోతామని అనుంపల్లి యువత స్పష్టం చేస్తోంది. కేవలం స్థానిక సమస్యగానే కాకుండా, ప్రభుత్వ విధానాలపై విశ్వసనీయతకు కూడా పరీక్షగా మారుతోంది.

# మోడీకి ట్రంప్ ఫోన్ కాల్..

**-హర్మూజ్ జలసంధి,**
**ద్వైపాక్షిక సంబంధాలపై సంభాషణ..!**

న్యూఢిల్లీ



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను నిలువరించేందుకు మధ్యవర్థిత్వం వహించి పాకిస్థాన్ విఫలమైన వేళ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ , అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఫోన్‌లో నలభై నిమిషాల పాటు సంభాషించుకున్న ఇరువురు హర్మూజ్ జలసంధి, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించుకున్నారు. ట్రంప్ తనకు ఫోన్ చేశారని, ఇద్దరి మధ్య ద్వైపాక్షిక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని మంగళవారం ఎక్స్ వేదికగా మోడీ పంచుకున్నారు.ఇరాన్, అమెరికా మధ్య రెండో దఫా చర్చల వార్తలు ఊపందుకున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీతో డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడడం ప్రాధాన్యం సంతరించుకుంది. హర్మూజ్ జలసంధి సంరక్షణ, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై మోడీ, ట్రంప్ చర్చించుకున్నారు.నా స్నేహితుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ వచ్చింది. భారత్ అమెరికా మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గురించి ఇద్దరం మాట్లాడుకున్నాం. భవిష్యత్‌లో అన్ని విభాగాల్లో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇద్దరం కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలోని పరిస్థితులపై, హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, సురక్షితంగా ఉంచడం ఎంత ముఖ్యమో కూడా చర్చించాం' అని మోడీ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# అమరావతి శక్తి ఇదీ

ఇక్కడ ఏర్పాటు చేసిన వన్–ఎస్ క్వాంటమ్ టెస్ట్ బెడ్‌ను ప్రారంభించారు. అనంతరం గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన వన్–క్యూ టెస్ట్ బెడ్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించి ఈ రెండు అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి, వరల్డ్ క్వాంటమ్ డేను పురస్కరించుకుని దేశంలోనే మొట్టమొదటి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీని ప్రోత్సహించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ రెండు క్వాంటమ్ టెస్ట్ బెడ్‌ల ప్రారంభంతో అమరావతి క్వాంటమ్ టెక్నాలజీకి లాంచ్ ప్యాడ్‌గా మారుతుందన్నారు. రాకెట్ ప్రయోగానికి శ్రీహరికోట ఎలా ఉందో.. క్వాంటమ్ లాంచ్ ప్యాడ్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందని చెప్పారు. ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటమ్ టెక్నాలజీ ప్రధానమన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో సాధికారత సాధించుకున్న దేశాలే భవిష్యత్తులో ముందుకు వెళతాయని పేర్కొన్నారు.

**ఆత్మనిర్భర్ స్ఫూర్తితో స్వదేశీ టెస్ట్ బెడ్‌లు**

క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేయాలని, దానికి అవసరమయ్యే హార్డ్‌వేర్ ఇక్కడే తయారు కావాలని పరిశోధకులకు తాను ఇచ్చిన పిలుపు వాస్తవరూపం దాల్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, పుణెలోని డీఆర్‌డీవో సహా వివిధ సంస్థల భాగస్వామ్యంతో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రెండు క్వాంటమ్ టెస్ట్ బెడ్‌లు సిద్ధమయ్యాయని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశీయంగానే ఈ రెండు టెస్ట్ బెడ్‌లు తయారయ్యాయని చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో రూపొందించుకున్న పది సూత్రాల్లో డీప్ టెక్ ఒక కీలకమైన అంశమని గుర్తుచేశారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో భాగంగా నిర్మితమైన తొలి క్వాంటమ్ టెస్ట్ బెడ్స్‌తో ఈ ఫెసిలిటీ కలిగిన దేశంలోనే తొలి రాష్ట్రంగా ఏపీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ టెస్ట్ బెడ్‌ల ద్వారా క్వాంటమ్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి, ధ్రువీకరించే సామర్థ్యం అమరావతికి వచ్చిందని సీఎం తెలిపారు. పరిశోధకులు, విద్యార్థులకు ఈ టెస్ట్ బెడ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

**స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం**

అమరావతిని కాలుష్యరహితమైన గ్రీన్ సిటీగా, నెట్ జీరో కాన్సెప్ట్‌తో నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తిరుపతిలో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్, విశాఖలో మెడ్‌టెక్, అనంతపురంలో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏర్పాటవుతున్న గూగుల్ డేటా సెంటర్‌కు 28న శంకుస్థాపన చేస్తున్నామని వెల్లడించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా స్టార్టప్‌లను పెంచాలన్న ఉద్దేశంతో ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

## సోషల్' గీత దాటితే వేటే

**-నకిలీ ఖాతాలతో వదంతులు వ్యాప్తి చేస్తే తప్పించుకోలేరు**
**-ఏఐ విశ్లేషణ, ఫోరెన్సిక్‌లతో గుర్తిస్తామని డీజీపీ హెచ్చరిక**
**-1,549 కేసుల్లో 1,344 మంది అరెస్టు**
**-వదంతులు వ్యాప్తి చేస్తే తప్పించుకోలేరు: డీజీపీ**



**అమరావతి,**

సోషల్ మీడియాలో హద్దులు దాటి పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. కొందరు సైకో నెటిజెన్లు ఇష్టారాజ్యంగా బూతులతో రెచ్చిపోతుంటే, మరికొందరు వదంతులు వ్యాప్తి చేయడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. నకిలీ ఖాతాలతో వదంతులు ప్రచారం చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎక్కడ దాక్కున్నా అరెస్టు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అసభ్య పదజాలం వాడటం.. సమాజంలో వర్గాల మధ్య చిచ్చు రేపేలా పోస్టులు పెట్టడం.. వంటి చర్యలకు పాల్పడిన 1,344 మందిని అరెస్టు చేసి, 1549 కేసులు పెట్టామని, 4,529 అభ్యంతరకర పోస్టులను తొలగించామని వివరించారు. సోషల్ మీడియా ఖాతాల్లో తప్పుడు ప్రచారాలు, వదంతులపై జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఐటీ యాక్ట్‌తో పాటు బీఎన్‌ఎస్ కింద కేసులు నమోదు చేస్తున్నామని, నకిలీ ఖాతాల్లో పోస్టులు పెట్టి తప్పించుకు తిరిగే వారిపై 'ట్రయల్ ఇన్ అబ్సెంటియా' విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. సోషల్ ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ద్వారా నిఘా పెట్టామని, ఏఐ విశ్లేషణ, రియల్ టైమ్ పర్యవేక్షణ, డిజిటల్ ఫోరెన్సిక్ విధానాలతో గుర్తిస్తున్నట్లు డీజీపీ వివరించారు.

## మహానాడు వేదికపై 17న తుది నిర్ణయం

**-టీడీపీ నేతలతో చర్చించిన లోకేశ్**
**-జాతీయ, రాష్ట్ర కమిటీలు, పొలిట్‌బ్యూరో సభ్యులు దాదాపు ఖరారు**
**-ఏ ఆత్మ చెప్పిందో జగన్ 'మావిగన్' అని కలవరిస్తున్నారు: లోకేశ్**

**అమరావతి,**

మహానాడు వేదికను ఈ నెల 17న ఖరారు చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ నిర్ణయించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుపాటు అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమయ్యారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా రణస్థలం, విజయనగరం జిల్లా నెల్లిమర్ల ప్రాంతాలను మహానాడు స్థల ఎంపిక కమిటీ పరిశీలించి వచ్చింది. వాటిని మరోసారి పరిశీలించి శుక్రవారం వేదికను ప్రకటించనున్నారు. అలాగే మహానాడులోపు పార్టీ రాష్ట్ర కమిటీని కూడా పూర్తి చేయాలని లోకేశ్ భావిస్తున్నారు. జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులను దాదాపు ఖరారు చేసినా.. మరోసారి వారి నేపథ్యాన్ని నిశితంగా పరిశీలించి ప్రకటించాలని పార్టీ నేతలకు సూచించారు.

**పార్టీ సిద్ధాంతాలే బలం**

పార్టీ సిద్ధాంతాలే నాయకత్వానికి బలమని, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జుల శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే కాదు.. వాటి వెనుక ఉన్న టీడీపీ సిద్ధాంతాలను వివరించడం కూడా ఎంతో ముఖ్యం. కార్యకర్తల్లో ఐక్యత, క్రమశిక్షణ ఉంటే పార్టీ మరింత బలపడుతుంది. కూటమి నేతల మధ్యే కాదు.. కార్యకర్తల నడుమ కూడా సఖ్యత ముఖ్యం. ఏ సమస్య ఉన్నా కూటమి నాయకులు కలిసి కూర్చుని పరిష్కరించుకోవాలి' అని సూచించారు. వైసీపీ విధ్వంసాల నుంచి సమాజాన్ని రక్షించేందుకే తాను రెడ్‌బుక్‌ను తీసుకొచ్చానని లోకేశ్ చెప్పారు. రాజారెడ్డి రాజ్యాంగంతో జగన్ సమాజాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని.. ఏ ఆత్మ చెప్పిందో 'మావిగన్' అంటూ కలవరిస్తున్నారని ఎద్దేవాచేశారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు.





**గడ్డి అన్నారం ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** ఘనంగా నిర్వహణ పారిశుధ్య కార్మికులకు గౌరవ సత్కారం

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ దళిత మోర్చా ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. డివిజన్ దళిత మోర్చా అధ్యక్షులు మహేందర్ రాజు, లోకేష్ ఆధ్వర్యంలో పలు చౌరస్తాలలో జయంతి వేడుకలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు అయిన సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా ప్రాధాన్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. అనంతరం జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి, వారిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నగర పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కృషి చేస్తున్న వారి సేవలు అమూల్యమని కొనియాడుతూ, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు చిలకూరి రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్ చారీ, శ్రీధర్ రెడ్డి, శ్రవణ్, కేశవ్, సిరి రెడ్డి, ఒట్టే రాజు, బాబు చౌదరి, బీష్మ చారీ, రత్నం, సతీష్, మణిదీప్, వివేక్ చారీ, హరీష్ రాహుల్, దినేష్, శ్రీనివాస్ యాదవ్, వినోద్, సిద్ధు, గిరీష్, నరేందర్, రఘునందన్ జోషి, టీంకు, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## పి అండ్ టి కాలనీలో అంబెడ్కర్ జయంతి వేడుకలు

**బాబాసాహెబ్ విగ్రహానికి భవాని ప్రవీణ్ కుమార్ ఘన నివాళి**






**గడ్డి అన్నారం ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ పి అండ్ టి కాలనీ చౌరస్తాలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలను సాధిద్దాం, జై భీమ్ జోహార్ డా. బాబాసాహెబ్ అంబేద్కర్ అనే నినాదాలతో పి అండ్ టి కాలనీ చౌరస్తా మార్మోగింది. ఈ సందర్భంగా భవాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ కలలను నిజం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ శ్రామికుడు కూడా పాలకుడిగా ఎదగాలని పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా సమానత్వం కోసం పోరాడిన అంబేద్కర్ గారి మార్గం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతంపేటలో 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు




**గన్నేరువరం,ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** అంతంపేట గ్రామపంచాయతీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు జరిగాయి.గ్రామ సర్పంచ్ వెంకటయ్య యాదవ్, ఉప సర్పంచ్ హరికృష్ణ మహారాజ్, గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు మహేష్ యాదవ్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు రాజు, సాయికిరణ్, లక్ష్మణ్, బన్నీ, సైదులు, రమేష్, నవీన్, రాజేష్, నితిన్ మరియు ఇతరులు హాజరై అంబేద్కర్ ఆశయాలను స్మరించారు.ప్రజలు సమానత్వం, న్యాయం, విద్య ప్రాముఖ్యతపై అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు.

## విజయవంతంగా ముగిసిన ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమం



**కరీంనగర్,-ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** కరీంనగర్ గణేష్ నగర్‌లోని ఒడిసి స్కూల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజకుమార్, బిఎల్ఓ జ్యోతి, బిఎల్ఓ శంకరమ్మ పాల్గొన్నారు. స్థానిక 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ, శ్రీనివాస్‌తో పాటు డివిజన్ ప్రజలు కూడా హాజరయ్యారు.ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# అంబేద్కర్... అందరివాడు

- చిట్వేల్లో జయంతి వేడుకలు అంగరంగ వైభవం
- ఐక్యంగా మారిన అన్ని పార్టీల నాయకత్వం
- ఉత్సాహంలో మునిగిన జనసంద్రం
- యువత రక్తదాన కార్యక్రమం







**చిట్వేలు, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** చిట్వేలు పట్టణం మంగళవారం ఒక మహోత్సవ వాతావరణాన్ని తలపించింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకలు గ్రామోత్సవాన్ని తలపించేలా వైభవంగా సాగాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు ఒకే వేదికపై చేరి అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానికంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం నుంచే సందడి మొదలైంది. నాయకులు పూలమాలలు వేసి నివాళు లు అర్పించగా, "జై భీమ్" నినాదాలతో పరిసరాలు మార్మోగాయి.

**రక్తదానంతో యువత స్ఫూర్తి**

అంబేద్కర్ జయంతి సందర్భంగా చిట్వేలి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు చిట్వేల్ హెల్ప్ లైన్ సొసైటీ నాయకుడు గాడి ఇంతియాజ్ అహ్మద్, ఉపాధ్యాయుడు దేవిడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. అంబేద్కర్ సర్కిల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి చిట్వేలు మండలంలోని యువకులు తరలివచ్చారు. అంబేద్కర్ జయంతి చరిత్రలోనే చిట్వేలి మండలంలో తొట్ట తొలిసారిగా జరిగిన ఈ రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేసి అంబేద్కర్ స్ఫూర్తిని చాటారు.

ఈ సందర్భంగా రాజుగుంట ఎంపీటీసీ నాన బాల నాగార్జున, రాజుగుంట సర్పంచ్ చిట్వేలి మండల టిడిపి నాయకులు గుత్తి నరసింహ, చిట్వేలి మండల వైసీపీ యువ నాయకులు చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, జనసేన మండల నాయకులు మాదాసు నరసింహ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం సమానత్వానికి ప్రతీక అని కొనియాడారు. రాజ్యాంగ రూపకర్తగా ఆయన చూపిన మార్గం దేశానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు.

మధ్యాహ్నం కార్యక్రమం మరింత ఉత్సాహంగా మారింది. అన్నదానం కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించగా, వందలాది మంది పాల్గొన్నారు.

అనంతరం అంబేద్కర్ చిత్రపటాన్ని చిట్వేలు పురవీధుల్లో ఊరేగించారు. భజనలు, కోలాటాలు, నృత్యాలతో ఊరంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. ప్రధాన రహదారిపై కోలాహలం నెలకొని, జన సందోహంతో పట్టణం కిటకిటలాడింది. ఈ వేడుకల్లో దళితుల ఐక్యత స్పష్టంగా ప్రతిబింబించింది. కూటమి, వైసిపి సహా వివిధ పార్టీల నాయకులు కలిసి పాల్గొనడం, సామాజిక సమానత్వానికి అంబేద్కర్ ఇచ్చిన సందేశం ఎంత ప్రాసంగికమో తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి శివప్రసాద్ రాజు, మద్దూరి మన్మధ, బొంతల నాగేశ్వరరావు, పెద్దం సాయి, కావేరి అవినాష్, మాదాసు శివ, దాది చంద్ర, కొనిశెట్టి చక్రి, మాదినేని రాజా, పవన్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఒక్కరోజు వేడుకగా కాకుండా... ఐక్యత, సమానత్వం సందేశంగా మారిన అంబేద్కర్ జయంతి చిట్వేల్లో ప్రజల హృదయాలను తాకింది.

# చంద్రబాబు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు

- -రూ. 2.75 కోట్లతో ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు,లైబ్రరీల ఆధునీకరణ
- -రాష్ట్రంలో 36 కేంద్రాలకు 216 కంప్యూటర్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన
- -మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- -శిక్షణ కేంద్రాల్లో కొత్త కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్ వేర్ ఏర్పాటు
- -ఏఐ, సైబర్ నెట్ వర్క్, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి డిమాండ్ కోర్సులకు శిక్షణ

**అమరావతి, -ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో రూ. 2.75 కోట్లు వ్యయంతో ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో కొత్త కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్ వేర్ తో పాటు, లైబ్రరీల ఆధునికరణ చేపడుతున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన రూ. 2.75 కోట్లు మొత్తం ప్రభుత్వం మంజూరు చేసి ఉర్దూ అకాడమీకి జమ చేయడం కూడా జరిగిందని మంగళవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 36 కేంద్రాలలో 216 కొత్త కంప్యూటర్లు, కొత్త యూపీఎస్ లు, లేజర్ జెట్ ప్రింటర్లు, స్కానర్ లతోపాటు ఆధునిక సాఫ్ట్ వేర్ ఏర్పాటు, లైబ్రరీల ఆధునీకరణ చేపడుతున్నట్లు అయన తెలిపారు. ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి యువతకు కొత్త కోర్సులు నేర్పించబోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ ), సైబర్ నెట్ వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, జావా, పైతాన్, గ్రాఫిక్ డిజైనింగ్ లాంటి, దేశ విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షకులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు

**చంద్రబాబు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమం, ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం చంద్రబాబు పక్షపాతిగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. చంద్రబాబు సారథ్యంలోనే ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, లైబ్రరీల ఆధునీకరణ యువత భవిష్యత్తును అత్యున్నత స్థాయిలో మార్చబోతున్నదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం నవ్యాంధ్రలో 36 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, (65 మంది బోధన సిబ్బంది,25 మంది ఇతర సిబ్బందితో) మరియు 36 ఉర్దూ లైబ్రరీలను కాపాడుకుంటూ రావడం జరిగిందన్నారు. 2014-2019 లో ఉర్దూ అకాడమీకి ఏకంగా రూ. 160.62 కోట్లు నిధులు ను సీఎం చంద్రబాబు విడుదల చేశారని, ఈ నిధులతో శిక్షణ కేంద్రాలు అత్యాధునిక ల్యాబ్ లుగా మారి వేలాదిమంది నిరుద్యోగ యువతకు సాఫ్ట్ వేర్ రంగంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణను అందిపుచ్చుకున్న యువత ఎంతోమంది దేశ విదేశాల్లోని ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తూ ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2019-2024 లో ఉర్దూ శిక్షణ కేంద్రాలను, లైబ్రరీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఫరూక్ విమర్శించారు. బడ్జెట్ విడుదల చేయకపోవడంతో గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోయి, మౌలిక సదుపాయాలు దెబ్బతిని, మైనారిటీ యువత కలలు కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధిక బడ్జెట్ కేటాయిస్తూ రావడం జరుగుతున్నదని మంత్రి వెల్లడించారు. ఉర్దూ శిక్షణ కేంద్రాలను పటిష్టం చేయడం, లైబ్రరీలను ఆధునికరించడం కోసం ప్రతి కేంద్రానికి 5 నుండి 6 కొత్త కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర మౌలిక సదుపాయాలు, ఆధునిక సాఫ్ట్ వేర్ ను ఏర్పాటుచేసి సరికొత్త హంగులతో పునః ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల జీవితాల్లో వెలుగులు నింపే, యువతకు ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగించే విధంగా శిక్షణ కోసం, లైబ్రరీల ఆధునికరణకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను, ఉర్దూ లైబ్రరీలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిందిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, డైరెక్టర్ గౌస్ పీర్ లకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సూచించారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి.

- -మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి
- -అంబాజీపేటలో ఘనంగా ఎల్లమ్మ అమ్మవారి 2వ వార్షికోత్సవం.



**మెదక్ జిల్లా -ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):** రేణుక ఎల్లమ్మ అమ్మవారి కృపతో మెదక్ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. మెదక్ జిల్లా శంకరంపేట్ ఆర్ మండలంలోని అంబాజీపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి 2వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో మంగళవారం మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులతో ఈ పరాభవనామ సంవత్సరంలో మంచి వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోలుకూరి లక్ష్మారెడ్డి, డా. సత్యనారాయణ, అంబాజీపేట గ్రామ నాయకులు కొమురవెల్లి నార గౌడ్, సుంకరి చంద్ర గౌడ్, కొమురవెల్లి మల్లేష్ గౌడ్, సుంకరి ఏళ్ళ గౌడ్, సుంకరి స్వామి గౌడ్, సాన మోహన్, రాజ్ కుమార్, తాళ్ల ఈశ్వర్, సుంకరి నాగరాజు, సుంకరి ప్రభు గౌడ్, కొమురవెల్లి బన్నీ, విఠల్, నర్సింలు, మండల ముఖ్య నాయకులు, గౌడ సంఘం నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈతోడులో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట.
-చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన కదిరి ఎమ్మెల్యే
-రాజ్యాంగ నిర్మాత ఆశయ సాధనే లక్ష్యం: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.




**తనకల్లు ఏప్రిల్ 14 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు అందరికీ మార్గదర్శకమని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తనకల్లు మండలం ఈతోడు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి గ్రామ ప్రజలందరికీ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ: "సమాజంలో అసమానతలను తొలగించి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి అనన్యసామాన్యం. ఆయన అందించిన రాజ్యాంగ ఫలాలు నేడు ప్రతి ఒక్కరికీ రక్షణ కవచంలా ఉన్నాయి. ఈతోడు గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహంతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం." ఈ కార్యక్రమంలో తనకల్లు మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అంబేద్కర్ అమర్ రహే అంటూ చేసిన నినాదాలతో గ్రామం మారుమోగింది.

## సోంపాలెం నాగభూషణంను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.



**తనకల్లు ఏప్రిల్ 14 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై, ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న తనకల్లు మండలంకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు సోంపాలెం నాగభూషణంను కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం పరామర్శించారు. నాగభూషణం నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న తీరును, కోలుకుంటున్న విధానాన్ని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తాము అండగా ఉంటామని, నాగభూషణం త్వరగా కోలుకొని తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## నల్లమల్ల ఘూట్ లో లారీ ఆర్టీసీ బస్సు డి.




**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
నంద్యాల నుండి గిద్దలూరు నల్లమల్ల ఘూట్ రూట్ లోవెళ్ళు రోడ్డు మార్గంలోని దొరబావి వంతెన వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికుల కు స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు కిలోమీటర్ల దూరంలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడశీ వల్లే ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## రివెళ్ళ పంచాయితీలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు .



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు డిప్యూటీ ఎంపీడీఓ ఇన్చార్జి ఈఓ అశ్విన్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి స్పెషల్ ఆఫీసర్ సి శివ మల్లేశ్వరప్ప మాజీ జెడ్పిటిసి యామ గుర్రప్ప ఇతర ప్రముఖులు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి యమ గుర్రప్ప మాట్లాడుతూ
మాట్లాడుతూ నవభారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవకారుడు భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహిళల స్వేచ్ఛ స్వాతంత్రానికై అహర్నిశలు కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు నాయకులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ధైర్య సాహసాలే.. అగ్నిమాపక సిబ్బందికి ఊపిరి





### గుంతకల్లులో అగ్నిమాపక వారోత్సవాల్లో వన్ టౌన్ సిఐ బి.మనోహర్

**గుంతకల్లు, ఏప్రిల్ 14(డ్రీమ్ టైమ్స్):**
ధైర్య సాహసాలే ఊపిరిగా అగ్నిమాపక సిబ్బంది విధి నిర్వహణలో తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారని గుంతకల్లు వన్ టౌన్ సిఐ బి.మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని గుంతకల్లు అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది స్థానిక అగ్ని మాపక కేంద్రం ఆవరణలో కవాతు నిర్వహించారు. అనంతరం వారి నుండి సి.ఐ మనోహర్ గౌరవ వందనాన్ని అందుకున్నారు. రెండు నిమిషాలపాటు మౌనం వహించి అగ్ని ప్రమాదాల నివారణలో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వన్ టౌన్ సీఐ మనోహర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను నివారించడం అంటేనే సాహసంతో కూడుకున్నది.. ప్రాణాలకు తెగించి అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలను నివారించగలుగుతున్నారంటే... వారు నిజంగా సాహస వీరులే అని కొనియాడారు. ఎంతటి భారీ అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భంలో సివిల్ పోలీసులకు సమాచారం అందేలోపు అగ్నిమాపక సిబ్బంది వాయువేగంతో ప్రమాద స్థలానికి చేరుకొని ప్రాణాలకు తెగించి ఆస్తి నష్టం, ప్రాణా నష్టం రెండూ జరగకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ప్రశంసించారు. అంతేకాకుండా అగ్నిమాపక సిబ్బంది సవ్య సాచి విద్యను కలిగి ఉంటారన్నారు. ఎందుకంటే నీటి ప్రమాదంలో కూడా వీరు ముందుంటూ పలువురిని ప్రాణాపాయం నుంచి కాపాడ గలుగుతున్నారన్నారు. అందుకే అగ్నిమాపక సిబ్బందిని సవ్యసాచులు అని కూడా చెప్పవచ్చు అన్నారు. అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ.. తరచూ అగ్నిమాపక సిబ్బంది చేసే సూచనలను పాటిస్తే అగ్ని ప్రమాదాలకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. స్థానిక అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎన్. అశ్వర్ధ మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14వ తేదీన అప్పటి బాంబే నౌకాశ్రయం లోని ఎస్ ఎస్ ఫోర్ట్ స్టీకిడ్ ఓడలో జరిగిన అగ్నిప్రమాదంలో వందలాదిమంది మృతి చెందగా.. అక్కడి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన అగ్నిమాపక సిబ్బంది 71 మంది ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. సహాయ చర్యల సమయంలో తమ ప్రాణాలను అర్పించిన అగ్నిమాపక సిబ్బంది జ్ఞాపకార్థం దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది ఏప్రిల్ 14వ తేదీ అగ్నిమాపక దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందుకే అగ్ని మాపక సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ అదే రోజు వారికి ఘనంగా నివాళులు అర్పిస్తారన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు పట్టణంలోని ప్రధాన కూడళ్ళలోను, ఆసుపత్రులు, విద్యాలయాలు, నివాస ప్రాంతాలు, పరిశ్రమల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే సమయంలో ఎలాంటి చొరవ చూపుతారు.. నీటి ప్రమాదం జరిగినప్పుడు బాధితులను ప్రాణాపాయం నుండి ఎలా గట్టెక్కిస్తారో అన్న విషయంగా విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరిస్తూ వారిలో అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని కసాపురం రోడ్డులో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి డాక్టర్. బాబా సాహెబ్ అంబేద్కర్

### ఆయన జయంతి కార్యక్రమంలో కొనియాడిన టిడిపి, వైసిపి, జనసేన, సిపిఐ నేతలు





**గుంతకల్లు, ఏప్రిల్ 14(డ్రీమ్ టైమ్స్):**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని.. పలువురు టిడిపి, వైసిపి, జనసేన సిపిఐ పార్టీల నేతలు కొనియాడారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని టిడిపి, వైసిపి నేతలు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఐ నేతలు ఆ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ యువజన సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బెంచికొట్టాలలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ తన అద్భుతమైన ప్రతిభతో భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి, భారతదేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి కారణమైన మహనీయుడు అయ్యారన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అజరామరమైనవి. ఆయన స్ఫూర్తిని, చూపిన మార్గాన్ని భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్క పౌరుడు కొనసాగించాలని, ఆయన రాజ్యాంగం ద్వారా అందించిన విలువలను కాపాడుకుంటే ప్రజాస్వామ్యం నిలబడుతుంది. స్వాతంత్రం కోసం మన పెద్దలు ఎన్నో త్యాగాలు చేశారు. వారి పోరాటాల స్ఫూర్తిని భావితరాల్లో నింపాలి అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బండి శేఖర్, అనంతపురం జిల్లా జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు పవర్ శేఖర్, గుంతకల్లు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు పాండు కుమార్, పామయ్య, ధనుంజయ, శేఖర్, రమేష్ రాజ్, గాజుల రఘు, సుబ్బయ్య, ఆటో రామకృష్ణ, అమర్నాథ్, సూరి, కథల వీధి అంజి, రామకృష్ణ, మైనారిటీ నాయకుడు దాదు, దోసులుడికి మల్లీ, మధు అంబేద్కర్ యువజన సేవా సమితి సభ్యులు రాజు, వీరేష్, శంకర్, వీరేంద్ర, శివ ఎన్డీఏ కూటమి సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, నిస్వార్థ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో:**
పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఎంతగానో ప్రయోజనకరంగా మారిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, జిల్లా నాయకులు మహేష్, పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, పట్టణ సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కమిటీ సభ్యులు దేవేంద్ర, దాసరి శ్రీనివాసులు, రూరల్ కమిటీ సభ్యులు ఉమర్ బాష, ఏఐటిసి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులు మల్లయ్య, కత్తి శీను, ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అంజి, శివ, నాయకులు రామలింగ, హనుమేష్, మున్సిపాలిటీ రవికుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# దీక్షలకు ముగింపు పలికిన టిడిపి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ బాబు




**చిట్వేల్, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**
రైల్వే కోడూరు నియోజకవర్గంలో పార్టీ అంతర్గత విభేదాలను సర్దుబాటు చేసి, నాయకత్వం--కార్యకర్తల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని టిడిపి రాజంపేట పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. చిట్వేలి మండలం చిల్లవాళ్లపల్లిలో న్యాయం కోరుతూ రెండు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న బూత్ ఇన్చార్జ్ రామిశెట్టి నరసింహులు, అలాగే పెనగలూరు మండలానికి చెందిన మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షేక్ సమీర్ భాష చేపట్టిన దీక్షలను మంగళవారం ప్రసాద్ బాబు స్వయంగా పళ్ళ రసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో నెలకొన్న సమస్యలే ఈ నిరసనలకు దారి తీసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అధిష్టానం తనను ఇక్కడికి పంపిందని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. దీక్షలు చేపట్టిన నాయకుల సమస్యలను పరిష్కరించేందుకు స్పష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నరసింహులు ప్రస్తావించిన గ్రామంలో గ్రావెల్ రహదారి నిర్మాణం చేపట్టేలా చూడనున్నట్లు, షేక్ సమీర్ భాష సూచించిన మసీదు నిర్మాణానికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్, మండలాధ్యక్షుడు నాగార్జున, నారాయణరెడ్డి, బాలు రామాంజనేయ నాయుడు, లారీ సుబ్బరాయుడు, మాజీ ఎంపీటీసీ కట్టా లోకేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్135 జయంతి వేడుకలు.

**రైల్వే కోడూరు, ఏప్రిల్ 14 డ్రీమ్స్ టైమ్స్**

రైల్వే కోడూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర మంగళవారం డాక్టర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక సమానత్వం అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ అజయమైన పోరాటం చేశారని కొనియాడారు ఆయన రచించిన రాజ్యాంగం వల్లే భారత దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగుతుందని తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ చేసిన సేవలు ఈరోజు యువత్ భారతదేశం అంతట నివాళు




లర్పిస్తుందన్నారు. న్యాయవాదిగా రాజకీయవేత్తగా సామాజిక సంస్కర్తగా భారతీయులకు చట్టాల ద్వారా రాజ్యాంగం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కుల మత రహిత ఆధునిక భారతదేశ కోసం అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం చేశాడన్నారు. తర్వాతతెలుగుదేశం పార్టీ యువ నాయకులు డి. సుధీర్ కుమార్ రాజు మాట్లాడుతూ భారతదేశానికి తొలి న్యాయ శాఖ మంత్రిగా పనిచేసే సమయంలో బలహీనవర్గాలకు రిజర్వేషన్ కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారున్నారు.అలాగే అంటరానితనంపై కఠిన చర్యలు తీసుకునే దానికి చట్టం తీసుకొచ్చారన్నారు. బలహీనవర్గాల ఆశాజ్యోతి గా ఆయన రాసిన రాజ్యాంగం పట్ల ఇప్పటికీ భారత దేశంలో ఒక ప్రత్యేక గౌరవం ఉందని ఆయన రాసిన బాటలో ప్రస్తుత భారత దేశ చరిత్ర నడుస్తుందని పేదల కోసమే పనిచేసిన ఘనచరిత్ర అంబేద్కర్ ది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పోతురాజు నవీన్, నార్జన హేమరాజు, మంద శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

-మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి.



మంత్రాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైకాపా నాయకుడు ప్రదీప్ రెడ్డి, వైకాపా మండల అధ్యక్షులు భీమిరెడ్డి, జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య, దళిత సంఘాల నాయకులు.



మంత్రాలయంలో అంబేద్కర్ విగ్రహం నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి. పక్కన వైకాపా నాయకుడు ప్రదీప్ రెడ్డి. వైకాపా మండల అధ్యక్షుడు భీమిరెడ్డి, జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య, ఇతర దళిత సంఘాల నాయకులు.

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం**

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం దళిత సంఘాల , ప్రజాసంఘాలు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్. బి.ఆర్ అంబెడ్కర్ 135వ జయంతి వేడుకలకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళిత సంఘాలు ప్రజా సంఘాల్లో శాలువా కప్పి పూల మాలలు వేసి సన్మానించారు. వారితోపాటు మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంచార్జ్ విశ్వనాథ్ రెడ్డి, జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి హనుమన్న , వైస్ ఎంపిపి పులకుక్క రాఘవేంద్ర ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు బొంబాయి శివ దళిత సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా ఉపాధి హామీ పనులు

-జాబ్ కార్డు అప్డేట్ లేదు, కూలీల సంఖ్య పెంచింది లేదు
-నీళ్లలో పనులు, పనులు చేసిన వారికి పడని బిల్లులు, సంతకాలు లేకుండా పేమెంట్లు
-మండల సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో పిడి దృష్టికి ఆసక్తికర విషయాలు.


**శిరివెళ్ళ(డ్రీమ్ టైమ్స్)**

శ్రమజీవుల వలసలు నివారించి ఉన్న ఊరిలోనే పనులు కల్పించాలన్న సదుద్దేశంతో జాతీయ ఉపాధి హామీ పనిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. ప్రభుత్వ ఆశయాలను ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా కూలీల సంఖ్య పెంచకుండా పనులు చేసిన వారికి సకాలంలో వేతనాలు ఇవ్వకుండా అసలు పని చేయని వారికి వేతనాలు వేసి నీళ్లలో సైతం పనులు చేసిట్లు రికార్డుల్లో ఉన్న పలు ఉద్యానవన చెట్లు క్షేత్రస్థాయిలో లేవని తదితర విస్తుపోయే ఉపాధి హామీ పనులు నంద్యాల జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సి సూర్యనారాయణ దృష్టికి వచ్చాయి. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ పనులపై బహిరంగ చర్చ వేదిక నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మరియు ఏపీ డి ఎంపీడీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా జరిగిన సామాజిక తనిఖీ నివేదికను బహిరంగంగా ప్రవేశపెట్టారు. ప్రతి గ్రామంలో కూలీలకు నీడ కల్పించడం లేదని ప్రథమ చికిత్స అడ్రస్ అందుబాటులో లేదని తనిఖీ బృందం పీడీ దృష్టికి తీసుకువచ్చారు. సంతకాలు లేకున్నా పేమెంట్ చేసినట్లు మరికొన్ని పనులు చేసినప్పటికీ



సకాలంలో పేమెంట్ చేయలేదని తెలియజేశారు. శిరివెళ్ల మండలం గుంపురమామిదిన్నె గ్రామంలో జాబ్ కార్డులు 40% అప్డేట్ చేయలేదని హాజరులో కొట్టు వేసి వేతనాలు ఇచ్చినట్లు మరియు నీళ్లల్లో పనులు చేసినట్లు వివరించారు. కామినేని పల్లె గ్రామంలో పనులు చేసినట్టు హాజరులో ఉన్నప్పటికి కొందరికి వేతనాలు అందించలేదని కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. ఓపెన్ ఫోరం మంగళవారం ఉన్నట్లు అధికారులు హాజరవుతున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ బోయలకుంట్ల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఏపీవో రామసుబ్బయ్యను ఏపీ డి సాంబశివరావును పిడి ఆదేశించారు. శిరివెళ్ల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేరని ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసిన మొక్కలు చెట్లు లేవని సంతకాలు చేసుకోకుండా పేమెంటు ఇచ్చారని అన్నారు. సర్వ శిక్ష అభియాన్ కింద 5 లక్షలకు పైగా జరిగిన వర్కులకు సంబంధించిన రికార్డులు ఇవ్వలేదని బహిరంగ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మోత్కుపల్లి గ్రామంలో కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదన్నారు. మహదేవపురం గ్రామంలో జాబ్ కార్డులు 50 శాతానికి కూడా అప్డేట్ కు నోచుకోలేదని కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని రికార్డులు మెయింటెనెన్స్ చేయకుండా అవగాహన లోపంతో ఉడతా భక్తిగా విధులకు హాజరవుతున్నారా అంటూ ప్రశ్నించారు. గోవిందపల్లె కోటపాడు జీనపల్లె వెంకటాపురం వీరారెడ్డి పల్లె తదితర గ్రామాలలో జాబ్ కార్డులను 100% అప్డేట్ చేసి కూలీల సంఖ్య పెంచేందుకు తక్షణమే కృషి చేయాలని ఆదేశించారు. యర్రగుంట్ల గ్రామంలో జామ చెట్లు చనిపోయాయని కొందరికి హాజరులో పనులు చేసినట్టు ఉన్నప్పటికీ పేమెంట్ చేయలేదని తెలియజేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని లేని పక్షంలో మేటీలతోనే పనులు కల్పించి సకాలంలో వేతనాలు అందించేందుకు టీఏలు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో వందలాదిగా ఉపాధి హామీ కూలీలు హాజరు కావాల్సి ఉండగా కేవలం పదుల సంఖ్యలో హాజరు కావడం పట్ల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో పనులు కల్పించకపోతే వర్షాకాలంలో ఎలా కల్పిస్తారని నిర్లక్ష్యాన్ని వీడి ఎటువంటి అవినీతి అక్రమాలకు పొరపాట్లకుతావు లేకుండా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ సి సూర్యనారాయణ ఆదేశించారు.

# బదిలీపై వెళ్తున్న సీఐకి సత్కారం



**ఆళ్లగడ్డ (డ్రీమ్ టైమ్స్)**

బదిలీపై వెళుతున్న ఆళ్లగడ్డ టౌన్ సీఐ యుగంధర్ ను మంగళవారం సాయంత్రం పోలీస్ సిబ్బంది సత్కరించారు. యుగంధర్ మాట్లాడుతూ.. సీఐగా 12 నెలల పాటు ఇక్కడ పనిచేశానన్నారు. సిబ్బంది. ప్రజల సహాయ సహకారాలు మరువలేనివని కొనియాడారు. టౌన్ ఎస్ఐలు శ్రీనివాస గౌడ్, చిన్న పీరయ్య, ఏఎస్ఐ వహాబ్, సిబ్బంది పాల్గొన్నారు

# నేటి యువత కు ఆదర్శం అంబెడ్కర్ జీవిత చరిత్ర..

మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి.

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం**


నేటి యువత కు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ .బి. ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ఆదర్శమని మంత్రాలయం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో ప్రజాసంఘాలు అధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన అంబెడ్కర్ 135వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్. బి. ఆర్ అంబెడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడానికి ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందన్నారు. నందదమూరి తారకరామారావు తెలుగు ఆత్మగౌరవం కోసం పోరాడుతూ, పేదల సంక్షేమం కోసం అనేక



కార్యక్రమాలు ప్రారంభించారు.ఈ రోజు కూడా తెలుగు దేశం పార్టీ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ, బీసీ వర్గాల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సమాన అవకాశాలు, విద్య, ఉపాధి ద్వారా ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రంలో సమానత్వం, సామాజిక న్యాయం బలోపేతం అవుతున్నాయని తెలిపారు. అలాగే యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ యువతలో స్ఫూర్తిని నింపుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళు న్నారని కొనియాడారులి.డా. బి.ఆర్. అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం, స్వాభిమానం కోసం చేసిన సేవలు అమూల్యమని ఆయన అన్నారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని, ముఖ్యంగా యువత ఆయన చూపిన దారిలో నడవాలని పిలుపునిచ్చారు ప్రజాసంఘాలు నాయకులు టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి కి శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాలు నాయకులు , అంబేద్కర్ యుత్ సభ్యులు , ఎస్ఐ మల్లికార్జున కూటమి పార్టీ నాయకులు వరదరాజు , బోయ వెంకటేష్ ,కమ్మసాలి నరసింహ , మద్రి శివ కుమార్ , రాజన్న , కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని నివాళులు అర్పించారు.

# రోకలి బండతో కొట్టి హత్య.. నిందితులు అరెస్టు

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్)**



ఆళ్లగడ్డ మండలం R. కృష్ణాపురం గ్రామంలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు నంద్యాల ఏఎస్పీ మంద జావళి తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గుర్రం దేవ భక్తుడు అనే వ్యక్తిపై ఆస్తి తగాదాలతో అదే గ్రామానికి చెందిన గుర్రం విజయరాజు, సుధారాణిలు రోకలి బండతో కొట్టి హత్య చేయడం జరిగిందన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించామన్నారు.

# తాడేపల్లిలో జగన్‌తో కోడూరు వైసీపీ నేతల భేటీ

-నియోజకవర్గ రాజకీయాలు, అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చ

**చిట్వేలి, ఏప్రిల్ 14 (డ్రీమ్ టైమ్స్):**

రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ కీలక నేతలు మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భేటీలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మలిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు. కోడూరు నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ స్థితిగతులపై వారు జగన్‌కు



వివరాలు అందించినట్లు తెలిసింది. సమావేశంలో భాగంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ప్రారంభమైన ప్రాజెక్టుల పురోగతి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వాటి అమలు స్థితిపై జగన్ ఆరా తీశారని సమాచారం. ప్రజలకు చేరువగా ఉండే విధంగా పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేయాలని ఆయన సూచించినట్లు నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులు ముందస్తుగా సన్నద్ధం కావాలని జగన్ పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కార్యాచరణను పటిష్టం చేసి, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచాలని సూచించినట్లు సమాచారం. ఈ భేటీతో రైల్వే కోడూరు నియోజకవర్గంలో వైసీపీ రాజకీయ కదలికలు మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తను పరామర్శించిన ఎంపీ నాగరాజు

**కర్నూలు-(డ్రీమ్ టైమ్స్)**



అనారోగ్యంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాబు ను ఎంపీ బస్తిపాటి నాగరాజు పరామర్శించారు.. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏ.ఎం.సీ వార్డులో చికత్స పొందుతున్న బాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు..ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు..అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు...

# బిజినెస్

## ఈవీలపై టాటా భారీ ఆఫర్లు

### రూ.3.30 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్న సంస్థ

**న్యూఢిల్లీ,**
దేశవ్యాప్తంగా ఈవీ కొనుగోలుదారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో టాటా మోటర్స్ ప్రత్యేకంగా రాయితీలను ప్రకటించింది. ప్రస్తుత నెలకుగాను అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ల కింద ఈవీలపై రూ.3.30 లక్షల వరకు తగ్గింపు పొందవచ్చునని తెలిపింది. టిగోర్, పంచ్, నెక్సాన్, కర్వ్, హారియర్ ఎస్‌యూవీతోపాటు టియాగో హ్యాచ్‌బ్యాక్‌ను తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. వీటిలో కర్వ్ ఈవీపై రూ.3.3 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపింది. ఎక్స్ఛేంజ్ బోనస్‌తోపాటు ఇతర డిస్కౌంట్లు కలుపుకొని మొత్తంగా రూ.3 లక్షలకు పైగా ఆఫర్ ఇస్తున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ కారు రూ.17.49 లక్షల నుంచి రూ.22.24 లక్షల లోపు దిగిరానున్నది. దీంతోపాటు పంచ్‌పై రూ.1.40 లక్షల వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. వీటిలో



రూ.1.10 లక్షల బోనస్‌తోపాటు రూ.30 వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందవచ్చునని తెలిపింది.ప్రస్తుతం ఈ కారు రూ.9.99 లక్షలు మొదలుకొని రూ.14.44 లక్షల లోపు లభించనున్నది. అలాగే హారియర్ ఈవీపై రూ.1.5 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు వెల్లడించింది. వీటిలో లక్ష రూపాయలు బోనస్ కింద, మరో రూ.50 వేలు ఎక్స్ఛేంజ్ బోనస్ కింద లభించనున్నాయి. ప్రస్తుతం హారియర్ రూ.21.49 లక్షల నుంచి రూ.30.23 లక్షల లోపు ధరకు విక్రయిస్తున్నది. టియాగో ఈవీపై రూ.1.2 లక్షల వరకు ఆదాకానున్నది. దీంట్లో లక్ష రూపాయలు బోనస్ కింద, మరో రూ.20 వేలు ఎక్స్ఛేంజ్ కింద అందిస్తున్నది. ఈ కారు ధర రూ.7.99 లక్షల నుంచి రూ.11.14 లక్షలకు దిగిరానున్నది. నెక్సాన్ ఈవీపై రూ.50 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది.

## ఇండిగో సమ్మర్ సేల్ ఆఫర్



**నూఢిల్లీ,**
ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో..వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా సమ్మర్ సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'సమ్మర్ గేటవే' సేల్ కింద దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లపై 10 శాతం వరకు డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది.ఈ నెల 17 వరకు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూలై 1 నుంచి అక్టోబర్ 9 లోగా ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు కంపెనీ వెబ్‌సైట్, మొబైల్ యాప్, వాట్సప్ సర్వీసెస్(7065145858)లతో బుకింగ్ చేసుకోవచ్చును. వీటితోపాటు ఫాస్ట్ ఫార్వర్డ్ సర్వీసులపై 70 శాతం రాయితీ ఇస్తున్న సంస్థ, బ్యాగేజ్‌పై 50 శాతం తగ్గింపుతో అందిస్తున్నది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ

**న్యూఢిల్లీ,** గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు వరదలా వస్తున్నాయి. జనవరి-మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్)ల్లోకి రూ.31,561 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. కిందటేడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే ఆరింతలు పెరిగాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఆంఫీ) తాజాగా వెల్లడించింది.మరోవైపు, అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో వచ్చిన రూ.23,132 కోట్లతో పోలిస్తే 36 శాతం ఎగబాకయని పేర్కొంది. మార్చి నెలలోనే రూ.2,266 కోట్ల పెట్టుబడులు ఆకర్షించిన గోల్డ్ ఈటీఎఫ్‌లు..ఫిబ్రవరి నెలలో రూ. 5,255 కోట్లు, జనవరి నెలలో రూ.24, 040 కోట్లు పెట్టుబడులు వచ్చాయి.




# స్పోర్ట్స్

## చెన్నై చమక్.. కోల్‌కతాపై ఘన విజయం

### ఘోరంగా విఫలమైన బ్యాటర్లు రాణించిన నూర్, శాంసన్

**చెన్నై**
ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్(సీఎస్‌కే) వరస విజయాల జోరు కొనసాగుతున్నది. లీగ్‌లో తొలుత తడబడ్డ చెన్నై ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయంతో గాడిలో పడింది. మంగళవారం సొంతగడ్డపై జరిగిన పోరులో చెన్నై 32 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఘన విజయం సాధించింది. దిగ్గజ మహేంద్రసింగ్ ధోనీ గైర్హాజరీలో బరిలోకి దిగిన చెన్నై సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలుత సంజూ శాంసన్ (32 బంతుల్లో 48, 4ఫోర్లు, 3సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (29 బంతుల్లో 41, 4ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో చెన్నై 20 ఓవర్లలో 192/5 స్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7) మరోమారు ఘోరంగా నిరాశపర్చగా, గత మ్యాచ్ సెంచరీ హీరో శాంసన్..చెన్నైకి పెద్దదిక్కుగా మారాడు. ఆయూశ్ మాత్రె (17 బంతుల్లో 38, 6ఫోర్లు, 2సిక్స్‌లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. సీఎస్‌కే బ్యాటర్లకు మూకుతాడు వేస్తూ కోల్‌కతా స్పిన్నర్లు సునీల్ నరైన్ (1/21), అనుకూల్ రాయ్ (1/21), వరుణ్ చక్రవర్తి (3-0-26-0) పొదుపు పాటించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 160/7 స్కోరు చేసింది. రమణ్‌దీప్‌సింగ్(35), రోవ్‌మన్ పావెల్(31 నాటౌట్) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు బ్యాట్లు ఝులిపించడంలో విఫలమై స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. నూర్ అహ్మద్ (3/21), కంబోజ్ (2/26) ధాటికి కోల్‌కతా ఘోరంగా కుదేలైంది. దీంతో ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లాడిన కోల్‌కతా నాలుగింటిలో ఓడి కనీసం బోణీ కొట్టలేకపోగా, చెన్నై వరుసగా రెండో విజయంతో ఆకట్టుకుంది.

**శాంసన్, బ్రెవిస్ రాణించగా :** తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా..చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. లీగ్‌లో విజయమెరుగని కోల్‌కతా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో విఫలమవుతూనే ఉన్నది. ఇప్పటికీ సరైన కాంబినేషన్ లేక చేజేతులా మ్యాచ్‌లను వదులుకుంటున్నది. చెన్నైతో మ్యాచ్‌లోనూ అదే సీన్ పునరావృతం అయ్యింది. కెప్టెన్ రుతురాజ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశామనుకున్న కోల్‌కతాకు శాంసన్, మాత్రె రూపంలో ప్రతిఘటన ఎదురైంది. లీగ్‌లో సెంచరీతో ఫామ్ అందుకున్న శాంసన్..మాత్రె జతగా కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశాడు. వైభవ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ మూడు బంతులను శాంసన్ వరుసగా బౌండరీలు కొట్టి



తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరో ఎండ్‌లో మాత్రె..శాంసన్‌ను అనుసరించాడు. గ్రీన్ నాలుగో ఓవర్‌లో మాత్రె రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నాడు. అదే జోరు కొనసాగిస్తూ ఆరోరా ఆరో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగిన మాత్రె..రమణ్‌దీప్‌సింగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో శాంసన్ కూడా ఔట్ కావడంతో ఒత్తిడిలోకి వెళ్లిన చెన్నైని బ్రెవిస్ ఆదుకున్నాడు. సర్ఫరాజ్‌ఖాన్(23)తో కలిసి బ్రెవిస్ బౌండరీలతో చెలరేగాడు. మిడిల్ ఓవర్లలో కోల్‌కతా స్పిన్నర్లు కట్టుదిట్టం చేయడంతో పరుగుల రాక ఒకింత మందగించింది. లేకపోతే చెన్నై భారీ స్కోరు అందుకునేది.

**కోల్‌కతా ధమాల్ :** బౌలింగ్‌లో ఒకింత ఆకట్టుకున్న కోల్‌కతా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. ఓపెనర్ ఫిన్ అలెన్(1) సింగిల్ డిజిట్ స్కోరుకు పరిమితం కాగా, సునీల్ నరైన్(24), కెప్టెన్ రహానే(28), రఘువంశీ(27) క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. రింకూసింగ్(6), గ్రీన్(0) మరోమారు ఘోరంగా విఫలమయ్యారు. ఆఖర్లో రమణ్‌దీప్‌సింగ్(23 బంతుల్లో 35, 4ఫోర్లు, సిక్స్), పావెల్(22 బంతుల్లో 31 నాటౌట్, ఫోర్, రెండు సిక్స్‌లు) చెలరేగినా సాధించాల్సిన లక్ష్యం పెద్దగా ఉండటంతో గెలుపు సాధ్యం కాలేదు.

**సంక్షిప్త స్కోర్లు**
చెన్నై: 20 ఓవర్లలో 192/5(శాంసన్ 48, బ్రెవిస్ 41, త్యాగి 2/35, నరైన్ 1/21),
**కోల్‌కతా:** 20 ఓవర్లలో 160/7(రమణ్‌దీప్ 35, పావెల్ 31 నాటౌట్, నూర్ 3/21, కంబోజ్ 2/32)

**ఐపీఎల్-2026**

| జట్లు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 5 | 4 | 1 | 0 | 8 | 0.889 |
| పంజాబ్ | 4 | 3 | 0 | 1 | 7 | 0.720 |
| బెంగళూరు | 4 | 3 | 1 | 0 | 6 | 1.148 |
| హైదరాబాద్ | 5 | 2 | 3 | 0 | 4 | 0.576 |
| ఢిల్లీ | 4 | 2 | 2 | 0 | 4 | 0.322 |
| గుజరాత్ | 4 | 2 | 2 | 0 | 4 | -0.029 |
| లక్నో | 4 | 2 | 2 | 0 | 4 | -0.427 |
| చెన్నై | 5 | 2 | 3 | 0 | 4 | -0.846 |
| ముంబై | 4 | 1 | 3 | 0 | 2 | -0.772 |
| కోల్‌కతా | 5 | 0 | 4 | 1 | 1 | -1.333 |

నోట్:ఆ:ఆడినవి, గె:గెలిచినవి, ఓ:ఓడినవి, పా:పాయింట్లు, ర.రే:రన్‌రేట్, ఫ.తే:ఫలితం తేలనివి

## శాంసన్‌కు ఐసీసీ అవార్డు




**దుబాయ్**
భారత్ టీ20 ప్రపంచకప్ గెలువడంలో కీలకంగా వ్యవహరించిన స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను ఐసీసీ అవార్డు వరించింది. మార్చి నెలకు గాను శాంసన్ ఈ అవార్డు సొంతం చేసుకున్నాడు. స్వదేశం వేదికగా జరిగిన మెగాటోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా..వరుసగా రెండో టైటిల్‌ను నిలబెట్టుకుంది. టోర్నీలో తొలి మ్యాచ్‌లకు దూరంగా ఉన్న శాంసన్..కీలకమైన దశలో తనదైన శైలిలో విజృంభించి జట్టుకు చిరస్మరణీయ విజయాలందించాడు.జింబాబ్వేపై 24 పరుగులతో మొదలైన శాంసన్ దూకుడు వెస్టిండీస్‌పై 97, ఇంగ్లండ్‌తో సెమీస్‌లో 89, ఫైనల్లో కివీస్‌పై 89 పరుగులతో మొత్తంగా 199 ?రైస్టెక్‌రేట్‌తో 275 పరుగులతో మ్యాన్ ఆఫ్ ద సిరీస్ కైవసం చేసుకున్నాడు. తన కెరీర్‌లో శాంసన్‌కు ఇది తొలి మంత్లీ ఐసీసీ అవార్డు. మహిళల విషయానికొస్తే న్యూజిలాండ్ క్రికెటర్ అమెలీ కెర్‌కు ఐసీసీ అవార్డు సొంతం చేసుకుంది.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

# అనుకున్న తేదీకే 'టాక్సిక్'

## పుకార్లను నమ్మవద్దన్న మేకర్స్




కన్నడ స్టార్ నటుడు యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమా విడుదల వాయిదా పడిందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలపై చిత్ర బృందం తాజాగా స్పందిస్తూ క్లారిటీనిచ్చింది. ఈ సినిమాను అనుకున్న తేదీ ప్రకారమే జూన్ 4 వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. తొలుత ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ ఇరాన్ -అమెరికా వార్ నేపథ్యంలో వాయిదా వేసుకుంది.ప్రస్తుతం యశ్ ఈ సినిమా ప్రమోషన్ల కోసం అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'సినీమాకాన్' వేడుకలో పాల్గొంటున్నారు. దీనిని కేవలం పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా గ్లోబల్ మార్కెట్‌లోనూ భారీగా విడుదల చేసేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. 1940 నుండి 1970 మధ్య కాలంలో గోవా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు.




# బాబోయ్.. నెట్టింట గత్తరలేపుతున్న యాంకరమ్మ..

స్రవంతి చొక్కారపు గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ప్రస్తుతం తెలుగు ప్రజలకు ఆమె యాంకర్ గా సుపరిచితమే. బిగ్ బాస్ షో ద్వారా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన స్రవంతి.. ప్రస్తుతం యాంకర్ గా, నటిగా బిజీగా ఉంటున్నారు. ఇప్పుడిప్పుడే సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ వెండితెరపై సందడి చేస్తున్నారు.స్రవంతి కెరీర్ ప్రారంభంలో రాజశేఖర్ నటించిన 'మహంకాళి' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలు పోషించారు. అయితే, వివాహం తర్వాత ఆమె ఇండస్ట్రీకి దూరమయ్యారు. కానీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో, ఆమె ఒక జ్యూయెలరీ షాపులో సేల్స్ గర్ల్ గా కూడా పని చేశారు.గంటల కొద్దీ నిలబడటం కష్టమైనప్పటికీ కుటుంబం కోసం ఆ పనిని కొనసాగించారు. ఆర్థిక పరిస్థితులే ఆమెను తిరిగి ఇండస్ట్రీ వైపు నడిపించాయి. ఈసారి నటిగా కాకుండా యాంకర్ గా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. తన వాక్చాతుర్యంతో అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.ముఖ్యంగా తెలుగు రియాలిటీ షో 'బిగ్ బాస్' లో రెండుసార్లు పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ సినిమా వేడుక జరిగినా స్రవంతి ఉండాల్సిందే అన్నంతగా ఆమె బిజీ అయిపోయారు. కేవలం యాంకరింగ్ కే పరిమితం కాకుండా, స్రవంతి ఇప్పుడు నటిగా కూడా రాణిస్తున్నారు.ఇటీవల సుహాస్ నటించిన హే బలవంత్ సినిమాలో ముఖ్య పాత్ర పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఒక సాదాసీదా అమ్మాయి నుంచి, సేల్స్ గర్ల్ గా పనిచేసి, నేడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ యాంకర్ గా ఎదగడం వెనుక స్రవంతి పడ్డ కష్టం అపారం.

# లెనిన్స్ నుంచి రేపు సాంగ్ విడుదల

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'ఎట్టా ఎట్టా' వీడియో సాంగ్‌ను ఏప్రిల్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా.. కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, వంశీ ఐరటనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన మాస్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# జురాసిక్ పార్క్ మూవీని వదులుకున్న శ్రీదేవి



హాలీవుడ్ సినిమాల్లో అవకాశమొస్తే ఎవరైనా వదులుకుంటారా? డబ్బుకు డబ్బు.. కావాల్సినంత ప్రచారం రెండూ ఒకేసారి వచ్చి పడతాయి. అందులోనూ స్టీవెన్ స్పీల్‌బర్గ్ మూవీ అంటే కథేంటో కూడా అడగకుండా ఒప్పకొంటారు. కానీ, అలనాటి నటి శ్రీదేవి మాత్రం నో చెప్పారట. 1993లో విడుదలైన 'జురాసిక్ పార్క్' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల వసూళ్లను రాబట్టింది. అలాంటి చిత్రంలో నటించే అవకాశాన్ని శ్రీదేవి కాదనుకున్నారు. అందుకు గల కారణాన్ని ఆమె ఓ సందర్భంలో పంచుకున్నారు. మీరెందుకు 'జురాసిక్ పార్క్' చేయడానికి నిరాకరించారు అని అడగ్గా, 'ఆ రోజుల్లో హాలీవుడ్ సినిమాలంటే ఏలియన్‌లా చేయడమే. కానీ, ఇప్పుడు అదొక గౌరవం. అందుకే ఒప్పకోలేదు' అని శ్రీదేవి సమాధానం ఇచ్చారు. కేవలం 'జురాసిక్ పార్క్' మాత్రమే కాదు, శ్రీదేవి కెరీర్ టాప్‌లో ఉండగా, వివిధ కారణాల వల్ల చాలా పాత్రలు వదులుకున్నారు. అందులో 'డర్' కూడా ఉంది. 'చాందినీ, లమ్హే తర్వాత డర్‌లో నా పాత్ర చాలా సాధారణంగా ఉంటుందని భావించా. ఒకవేళ షారుఖ్‌ఖాన్ పోషించిన పాత్రలాంటిదైతే చేసేదాన్నేమో.ఆ క్యారెక్టరైజేషన్ నాకు బాగా నచ్చింది. ఇక జుహీచావ్లాకు అలాంటి పాత్ర కొత్తది. ఆమె సరిగ్గా సరిపోయారు' అని శ్రీదేవి చెప్పకొచ్చారు. 2018, ఫిబ్రవరి 24న శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే.



# ఆ టాలీవుడ్ స్టార్ హీరోతో అలియా భట్..

## పాన్ ఇండియా ప్రాజెక్టులో బాలీవుడ్ బ్యూటీ..

బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ క్రేజ్ గురించి తెలిసిందే. హిందీలో తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేసిన ఈ అమ్మడు.. గంగుబాయి కతియవాడి వంటి సినిమాతో జాతీయ అవార్డ్ అందుకుంది. గ్లామరస్ కథానాయికగా.. ఇటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ మెప్పించింది. ఇదివరకే తెలుగులో ఓ సినిమాలో కనిపించి దక్షిణాది సినీ ప్రియుల హృదయాలు గెలుచుకుంది అలియా.తాజాగా ఈ అమ్మడు మరోసారి తెలుగు తెరపై సందడి చేయనుందని టాక్. రాబోయే పాన్ ఇండియా తెలుగు చిత్రంలో ఓ కీలకపాత్రలో ఈ ముద్దుగుమ్మ కనిపించనుందని టాక్. ఆ సినిమాలో ఒక ముఖ్య పాత్ర కోసం అలియా పేరును పరిశీలిస్తున్నారట మేకర్స్. ఇది ఖరారైతే మరోసారి తెలుగు సినీప్రియులను ఈ అమ్మడు అలరించడం ఖాయమని తెలుస్తోంది.ఇప్పటికే ఆ ప్రాజెక్ట్ పై దేశవ్యాప్తంగా విపరతీమైన బజ్ నెలకొంది. ఎప్పుడెప్పుడు ఆ సినిమా విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అడియన్స్. ఈ క్రమంలోనే మోస్ట్ అవైటెడ్ చిత్రంలో ఇప్పుడు అలియా సైతం భాగమవుతుందనే టాక్ వినిపించడంతో ఆ ప్రాజెక్ట్ పై మరింత హైప్ ఏర్పడింది. ఇంతకీ ఆ ప్రాజెక్ట్ ఏంటీ.? అనే విషయాలు తెలుసుకుందామా.ఎన్టీఆర్ హీరోగా డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న లేటేస్ట్ చిత్రం డ్రాగన్ (ప్రచారంలో ఉన్న పేరు). కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. ఈ మూవీ కోసం ఎన్టీఆర్ లుక్ పూర్తిగా మార్చేశారు. కండలు తిరిగిన దేహంతో ఇటీవల షేర్ చేసిన ఫోటోతో అభిమానులకు సర్ ప్రైజ్ ఇచ్చారు.ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ డ్రాగన్ సినిమాలో ఓ పవర్ ఫుల్ పాత్రలో అలియా భట్ కనిపించనున్నారట. ఈ సినిమాలో డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఓ పవర్ ఫుల్ పాత్రను డిజైన్ చేశారని.. అందులో కథానాయికగా రోల్ కోసం అలియా పేరు పరిశీలిస్తున్నారని టాక్. గతంలో ఆర్ఆర్ఆర్ చిత్రంలో సీత పాత్రలో కనిపించింది అలియా.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831